## పగటి కల

ఉత్సాహంతో జాతీయ కార్యక్రమాల నిర్వహణ
గత కాల వైభవం
నామమాత్రపు మొక్కుబడి తంతు
నేటి నిర్వహణ తీరు
సొంత రాజకీయ పార్టీలో
అసంతృప్తి అగ్నిగుండాలు
బుసలుకొడుతున్న బోఫోర్స్ ఫార్స్
అదుపుతప్పిన టెర్రరిస్టుల హింసావాదం.
నిజం తెలిపే వార్తాపత్రికలు
మరీచికలు వూసరవెల్లులు
ప్రభుత్వ నేత్రాలకు;
ఒయాసిస్‌లు
ప్రజలకు.
ఇంట్లో విరబోసుకున్న
దారిద్ర్య ప్రమాదం
బయట వుత్సవాల వినోదం
విదేశాల్లో ప్రారంభోత్సవాలు
స్వదేశంలో వైఫల్యాలు.
చిందుతొక్కుతున్న ప్రాంతీయవాదం
ప్రాంతీయవాదుల్లో పెచ్చరిల్లిన
పదవీ కుమ్ములాటల వీరంగాలు
కుల ప్రదర్శనల పగటి వేషాలు.
నేటి రాజకీయ నాయకుని పగటి కల
ప్రధాని పదవి
పేరిగాడి పట్టాభిషేకం
ప్రోత్సాహక స్వప్నం
పేరాశల పుష్పగుచ్ఛం
దానయ్యల అభిలాష.

—వి. వరప్రసాదరావు



పాలపర్తి శ్యామలానంద్

'ఢఢ' అనుచు విసుగుతో దబ్బున ఫోను పెట్టిన శబ్దము ఆయన శ్రీమతికి వినవచ్చెను.

* * *

నాలుగు దినముల అనంతరము ఆ వారపు 'ఆంధ్రజ్యోతి' వచ్చెను. యథాలాపముగా దానిని తిరుగవేయుచున్న పావనిశాస్త్రి ఆశ్చర్యచకితుడయ్యెను. దానిలో తాను పారవేసికొంటిననుకొన్న కథ 'చెవిలో పువ్వు' శీర్షికతో ముద్రితమై యుండెను.

భార్యను పెద్దగా కేకవైచి పిలచెను. ఆమె వచ్చెను. పత్రికను చూపి ఆనందాశ్చర్యములతో 'ఇదెట్లు జరిగినదో?!' అనెను.

'మన వీథిలోని బంధువుల ఇంటికి సీత పిన్నిగారు రాగా మీరు సాపు వ్రాసిన కథను చేతి పెట్టెలో నుండి తీసి ఆమెకిచ్చి బాబాయిగారి కిమ్మంటిని. ఆనాడు సాయంత్రము ఆమె ఇంటివద్ద బాబాయిగారికి ఇచ్చియుందురు.'

'నీ వెందుకట్లు చేసితివి?'

'మీ రెందుకట్లు చేసితిరి?'

'ఉపన్యాసమునకని చెప్పి సినిమాకు పోయితినని యా?'

'చెవిలో పువ్వులు పెట్టువారి సిగలో పూలగుత్తులు పెట్టెడి వారుందురని గమనింపుడు.'

'బాగు బాగు. 'పత్న్యా ఇచ్ఛేత్ పరాజయం'

"ఏమో నాకు సంస్కృతము రాదు. ఆడుదానను కదా!" అనుచు ఆమె కించిత్ విజయగర్వముతో చేసిన సితమందహాసము కన్నులలోనికి ప్రాకగా ఆ కనులు పాల సముద్రములో ఒకదాని కొకటి ఎదురుపడిన రెండు 'జలపుష్పము'ల వలె పావని శాస్త్రికి తోచెను.

'సంస్కృతము ఆడువారికే బాగుగా వచ్చును' అనుచు ఆనందముతో తలయూచెను.

## ఇది కూడా ఖరీదే

**సినీ తారలంటే మోజు ఒక క్రానిక్ డిసీజ్ లాంటిది. అది కొంత మందికే కాదు జనాభాలో ఎక్కువ మందికి వ్యాపించడం విశేషం.**

**ఇద్దరు సినీతారలు షూటింగ్‌కి ఆ ఊరు వచ్చారు. ఒకామె కాంతిశ్రీ. మరొకామె శాంతిశ్రీ.**

ఆకాశంలోంచి నక్షత్రం జారిపడిదంటే ఎలా వుందో చూద్దామని జనం పరుగెత్తినట్లే, సినీతార తమలాగే మనిషే అయినా వేలంవెర్రి జనం వాళ్ళ కోసం తెగ తాపత్రయపడిపోతారు. చదువుకునే పిల్లలయితే ఆటోగ్రాఫ్‌ల వేధిస్తారు. పిచ్చి అభిమానులైతే రూపాయనోట్ల మీద వాళ్ళ సంతకాలు పెట్టించుకుని, ఆ నోట్లు ఖర్చుపెట్టకుండా వుంచుకోడం కూడా జరుగుతూంటుంది.

ఒక కాలేజీలో షూటింగ్ జరుగుతోంది. విద్యార్థినీ విద్యార్థులు తారల సంతకాల కోసం, వాళ్ళని చూడడం కోసం తాపత్రయ పడుతున్నారు.

కాంతిశ్రీ చుట్టూ విపరీతంగా జనం వున్నారు. చాలా కష్టం మీద అందరికి ఆటోగ్రాఫ్‌లు పెడుతోందామె.

శాంతిశ్రీ దగ్గరకు ఎక్కువమంది వెళ్ళడం లేదు.

ఈలోగా పత్రికా విలేకరులు వచ్చారు.

శాంతిశ్రీ దగ్గరకు వచ్చారు ముందు.

"కుమారి శాంతిశ్రీగారూ! సినీ ఫీల్డులోకి నిన్న గాక మొన్న వచ్చిన కాంతిశ్రీగారి దగ్గరకు ఆటోగ్రాఫ్ కోసం అంతమంది వెళ్తున్నారు. సినీలోకంలో మీరు బిజీస్టార్ కదా! మీ దగ్గరకు ఎందుకు ఎక్కువ మంది రావడం లేదు?" అంటూ మొదటి ప్రశ్న వేశారు.

"ఈ ఆటోగ్రాఫ్‌లు ఇచ్చేటప్పుడు అభిమానులు నన్ను క్రిందపడేసిన సంఘటనలు కూడా వున్నాయి. నేను పిచ్చి గీత పెట్టినా సంతోషిస్తారు. అందుకని నా ఆటోగ్రాఫ్ వేయించుకున్నవాళ్ళు పది రూపాయలు ఇవ్వాలని నా సెక్రటరీ చేత అందరికి చెప్పించాను. చూడండి ఏదైనా ఉచితంగా వస్తుందంటే జనం ఎగబడతారు. అదే పది పైసలు పెట్టకొవాలంటే ఆలోచిస్తారు. నేను ఈ ఆటోగ్రాఫ్‌ల ద్వారా వచ్చిన డబ్బు అనాథ శరణాలయాలకు ఇచ్చేస్తున్నాను. ఇది తప్పంటారా?" అందామె.

"వెల్‌డన్! శాంతిశ్రీగారూ" అంటూ విలేకరులు కాంతిశ్రీ వేపు వెళ్ళారు.

—కె.బి. కృష్ణ